

# 11. ఎన్నికలలో !

కాలేజీకి రాగానే అందిన కవర్లు చూసుకుని లెక్చరర్లందరూ హడావుడి పడిపోయారు. మగవాళ్ళు కంగారు పడకుండా ఎవరికే ఊరో కనుక్కొని ఆ ఊళ్ళో దొరికే సౌకర్యాల గురించీ తమ పాత అనుభవాల గురించీ మాట్లాడుకుంటున్నారు. ఆడవాళ్ళు కంగారు పడుతున్నారు.

"మన పేర్లు పంపించవద్దని ప్రిన్సిపాల్‌తో చెప్పాంగా" అంది ఉమ.

"అదేతప్పు-మనం చెప్పాం గనుక తప్పకుండా పంపారు. లేనిపోనిది గుర్తు చేశాం" అంది సుగుణ.

"సరే-ఆయన కచ్చికొద్దీ పంపాడే అనుకో. ఆ తాలూకా ఆఫీసు వాళ్ళకేలా బుద్ధిలేదు ? పోయిన ఎలక్షన్లకి మగాళ్ళందరూ రిజర్వ్‌లో కూచుని మనం లారీ లెక్కెతుంటే సరదాగా చూశారు గదా. మనల్ని అలా రిజర్వ్‌లోనన్నా పెట్టి గూడదూ ?" కమల కోపం ఆపుకోలేకపోయింది.

"ఎందుకు పెడతారండీ. ఈ ఆడాళ్ళు లెక్చరర్లయి మగ లెక్చరర్లతో పాటు సంపాదిస్తారా అని వాళ్ళ ఏడుపు. మనల్ని లారీ లెక్కెస్తేగానీ వాళ్ళ కచ్చి తీరదు" సుగుణ అంది.

"డ్యూటీ వేసిన తర్వాత చెయ్యక తప్పదు. ఇట్లా అశాంతి పెంచుకోవడం కంటే అదేదో చేసెయ్యడం మంచిది" అన్నది ప్రసన్న.

"చెయ్యక చస్తామా ? కింద రాశారుగా డ్యూటీ చెయ్యకపోతే ప్రాసిక్యూట్ చేస్తామని" ఉమ నిరసన ప్రకటించింది.

"ఈ ఎలెక్షను క్లాసు చూడండి ఆదివారం పెట్టారు. వర్కింగ్‌డేలో పెడితే ఆన్ డ్యూటీతో ఈ కాలేజీ పని తప్పేది. అది తప్పలేదు సరిగదా ఆదివారమన్నా విశ్రాంతి లేకుండా పోయింది."

"ఎలక్షన్ క్లాసులో ఏం చెబుతారండీ ?" అప్పటిదాకా అందరి మాటలూ బుద్ధిగా వింటున్న విమల అడిగింది.

"ఏమీ చెప్పరు. మనకేమన్నా ఎలెక్షన్ గురించి తెలిసిందుంటే అది కాస్తా మాపేసి బుర్రంతా అయోమయం చేసేస్తారు. ఎలక్షన్ క్లాసు కెళ్ళేది డబ్బుకోసమే. వాళ్ళు చెప్పేది విన్నామా బి.పి. పెరిగి టెన్షన్ ఎక్కువై డ్యూటీ అంతా అస్తవ్యస్తం చేసేస్తాం. మీరిదే మొదటిసారి కాబోలు. అసలు వినకండి" రంగారావు సలహా ఇచ్చాడు.

"వినకపోతే ఏం చెయ్యాలో ఎలా తెలుస్తుంది ?"

"తెలియకపోతేనే చెయ్యడం తేలిక. వాళ్ళు చెప్పేవన్నీ బుర్రకెక్కించుకుంటే లేనిపోని గొడవలు. రేపు క్లాసు కొస్తే మీకే తెలుస్తుంది" బెల్ అవడంతో అందరూ క్లాసులకు బయల్దేరారు.

0 0 0 0

జూనియర్ కాలేజీ ఆవరణంతా ఎలక్షన్ డ్యూటీ పాఠాలు వినడానికి వచ్చిన లెక్చరర్లతో నిండిపోయింది. ఓ గదిలో వందమంది కూర్చున్నారు. తాసీల్దారు పెదవులు కదిలించడం వల్ల అతను మాట్లాడుతున్నట్టు తెలుస్తోంది తప్ప అతనేం చెబుతున్నాడో ఎవరికీ వినపడడం లేదు.

"ఇదేం క్లాసు ?" ఎవరో అంటున్నారు.

"తాసిల్దారుని పాఠం చెప్పమంటే ఇంకెలా వుంటుంది? మనలో అనుభవం వున్నవారిని చెప్పమనగూడదా ?"

